
సాక్షి ఒడిశా

శుక్రవారం । 8 । మార్చి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.3,31,742
బంగారం	2 గ్రాముల 100 మిల్లీ గ్రాములు
వెండి	10 గ్రాముల 600 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



శివ పూజకు వేళాయె..!

భువనేశ్వర్‌లోని ఏకామ్ర క్షేత్రవాసుడు లింగరాజు ఆలయంలో మహా శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. - 8లో



'కాంగ్రెస్ విజయానికి సమష్టిగా పనిచేద్దాం' - 8లో

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి సమష్టిగా పనిచేద్దామని జయపురం డీసీసీ నూతన అధ్యక్షుడు శశిభూషణ పాత్రో కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

న్యూస్‌రీల్

సీఎం నవీన్‌తో మాజీ ఎమ్మెల్యేలు భేటీ



సీఎం నవీన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యేలు

బరంపురం: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గంజాం జిల్లాలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. దీనిలో భాగంగా బుధవారం రాత్రి జిల్లాకి చెందిన 6 మంది మాజీ ఎమ్మెల్యేలు సీఎం నవీన్ పట్నాయక్‌తో భేటీ అయ్యారు. వారిలో మాజీ డిప్యూటీ స్పీకర్ రామచంద్ర పండా, శిబ శంకర్ సాహని, ఉదయనాథ్ నాయక్, అశోక్ చౌదరి, పూర్ణచంద్ర సెఠి, సింహాచల్ బెహరాలు ఉన్నారు. దీంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా చర్చలు జరుగుతున్నాయి.

1,256 కిలోల గంజాయి ధ్వంసం



గంజాయిని ధ్వంసం చేసేందుకు సిద్ధం చేసిన దృశ్యం

రాయగడ: జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో 23 కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న 1,256 కిలోల గంజాయిని జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ గురువారం ధ్వంసం చేసింది. టికిరిలోని దొరగుడ ప్రాంతంలో ఉన్న ఉత్కళ అలూమిన కర్మాగారంలో ఈ గంజాయిని అధికారుల సమక్షంలో ధ్వంసం చేసినట్లు జిల్లా పోలీసు కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది. కార్యక్రమంలో ఎక్సైజ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బీఎస్‌కేవై కార్డులు పంపిణీ



హెల్త్ కార్డులు అందజేస్తున్న అధికారులు

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితిలో ఉన్న 19 పంచాయతీలకు చెందిన 223 మందికి మల్కన్‌గిరి సమితి కార్యాలయం వద్ద బీఎస్‌కేవై(బిజూ ఆరోగ్య కల్యాణ్ యోజన) పథకం కార్డులు గురువారం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఈ హెల్త్ కార్డుల ద్వారా గిరిజన కుటుంబాల్లో మహిళకు అనారోగ్యం వస్తే రూ.10 లక్షల వరకు, పురుషుడికి అనారోగ్యం అయితే రూ.7 లక్షల వరుకు ప్రభుత్వం ఖర్చు చేస్తుందని వివరించారు. ఈ కార్డులు ప్రతీ పంచాయతీలో అందజేస్తారని మల్కన్‌గిరి జిల్లా వైద్యాధికారి ప్రఫుల్ల కుమార్ నాందో తెలిపారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి సమితి అధికారి ప్రతిభ జోడియా తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 30న బార్ కౌన్సిల్ ఎన్నికలు



కొత్త సభ్యుల జాబితా విడుదల చేస్తున్న దృశ్యం

బరంపురం: ఈనెల 30వ తేదీన బార్ కౌన్సిల్ ఎన్నికలు జరగనున్నట్లు ఎన్నికల అధికారి బసంత్ కుమార్ పండా తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఎన్నికల అధికారి అనిల్ కుమార్ పండా సమక్షంలో ప్రస్తుత బార్ సంఘం కార్యదర్శి పితావాసి పండా బార్ సంఘం సభ్యుల జాబితా గురువారం విడుదల చేశారు. అనంతరం ఎన్నికల అధికారి అనిల్ కుమార్ పండా మాట్లాడుతూ.. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, సహాయ కార్యదర్శి పదవుల కోసం ఈనెల 11, 12వ తేదీల్లో బార్ కార్యాలయ ప్రాంగణంలో నామినేషన్ల ప్రక్రియ జరగనున్నట్లు చెప్పారు. 19వ తేదీన స్క్రూట్నీ, 20వ తేదీన నామినేషన్ విత్ డ్రా, 21వ తేదీన పోటీలో ఉన్నటువంటి అభ్యర్థుల ప్రకటన జరగనున్నాయి. అనంతరం మార్చి 30వ తేదీన జరగనున్న ఎన్నికల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బార్ సంఘం సభ్యులు తమ ఓటు హక్కు వినియోగించుకుంటారు. సాయంత్రం 5 గంటల నుంచి అభ్యర్థుల ఓట్ల లెక్కింపు కార్యక్రమం, అనంతరం రాత్రి విజేతల ప్రకటన ఉంటుందని తెలియజేశారు.

బిజూ పరివార్ ఏకీకృతం..!



బీజేడీలో చేరిన అరబింద మహాపాత్రో

- పార్టీకి దూరమైన వారితో బీజేడీ సంప్రదింపులు
- బీజేడీలో చేరిన అరబింద మహాపాత్రో
- బీజేపీతో మరలా కూటమి..?

భువనేశ్వర్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాష్ట్రంలో రాజకీయాలు రోజుకొక్క మలుపు తిరుగుతున్నాయి. 5టీ చైర్మన్ వి.కార్తికేయ పాండియన్ తెర వెనుక వ్యూహం ఊహాతీత పరిణామాలను తెరపైకి తెస్తోంది. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ చలువతో త్వరలో జరగనున్న 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు బిజూ పరివార్‌ను ఏకం చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆయన ఆచితూచి అడుగులు వేస్తున్నారు. పలు కారణాలు, పరిస్థితుల దృష్ట్యా బీజేడీకి దూరమైన పలువురు అగ్రశ్రేణి నాయకులతో మంతనాలు, సంప్రదింపులతో బీజేడీ వ్యూహాత్మకంగా రంగంలోకి దిగేందుకు నడుం బిగిస్తోంది.

ప్రజాదరణ నాయకుడు బిజయ్ మహాపాత్రో

1990ల ప్రారంభంలో బిజూ పట్నాయక్ ప్రభుత్వంలో శక్తివంతమైన మంత్రిగా పనిచేసిన బిజయ్ మహాపాత్రో బిజూ జనతా దళ్ (బీజేడీ) వ్యవస్థాపక సభ్యుడు.

రాష్ట్ర శాసనసభకు 4 సార్లు ఎన్నికయ్యారు. అతను మంత్రిగా ఉన్న సమయంలో పటకురా మరియు మహాకలపడా ప్రాంతాల్లో విశేష ప్రజాదరణ నాయకుడుగా పేరొందారు. అయితే 2000 సంవత్సరంలో నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని పార్టీ నుంచి బహిష్కరించబడ్డాడు. ఈ పరిస్థితుల్లో 2001లో ఒరిస్సా గణ పరిషత్ (ఓజీపీ) అనే ప్రాంతీయ పార్టీని స్థాపించారు. అప్పటి కాలమాన పరిస్థితులకు అనుగుణంగా శరద్ పవార్ నేతృత్వంలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ)లో ఓజీపీ విలీనం చేశారు. అయితే 2009 ఎన్నికలు పురస్కరించుకుని విరోధి బీజేడీతో ఎన్‌సీపీ పొత్తు పెట్టుకోవడంతో బిజయ్ మహాపాత్రో బీజేపీలో చేరారు. 4 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన బిజయ్ మహాపాత్రో 2009, 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పటకురా మరియు మహాకలపాడ స్థానాల నుంచి పోటీ చేసి ఓడిపోయారు.

బీజేడీలోకి అరబింద మహాపాత్రో

స్థానిక నవీన్ నివాస్‌లో సీఎం నవీన్ పట్నాయక్ సమక్షంలో మాజీ మంత్రి, భారతీయ జనతా పార్టీ ప్రముఖ నాయకుడు బిజయ్ మహాపాత్రో కుమారుడు అరబింద మహాపాత్రో అధికార బిజూ జనతా దళ్ (బీజేడీ)లో గురువారం చేరారు. ఇదొక ఊహాతీత పరిణామం. కార్యక్రమానికి కేంద్రాపడా జిల్లాకు చెందిన పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు, పరిశీలకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అరబింద మహాపాత్రో గత 2 ఏళ్లుగా కేంద్రాపడా జిల్లా పటకురా అసెంబ్లీ నియోజకవర్గం రాజకీయాల్లో చురుకుగా ఉన్నారు. అతని తండ్రి బిజయ్ మహాపాత్రో 4 సార్లు (1980, 1985, 1990, 1995) పటకురా నియోజకవర్గం నుంచి రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. 1990 సంవత్సరంలో బిజూ పట్నాయక్ ప్రభుత్వంలో శక్తివంతమైన మంత్రిగా పనిచేసిన బిజయ్ మహాపాత్రో బీజేడీ వ్యవస్థాపక సభ్యుడు కావడం విశేషం. ఈ సందర్భంగా అరబింద మాట్లాడుతూ.. పటకురా అసెంబ్లీ నియోజకవర్గం మరింత అభివృద్ధి చేసేందుకు, వాళ్ల నాన్న ఆశీర్వాదంతో బీజేడీలో చేరినట్లు తెలిపారు.

సుదీర్ఘకాలం తర్వాత

బీజేపీ, బీజేడీ ఎడాపెడ మనోభావాలతో విడిపోయిన 15 సంవత్సరాల తర్వాత మరలా ఇప్పుడు పునః కూటమి దిశలో అడుగులు వేస్తున్నాయి. రాబోయే లోక్‌సభ ఎన్నికలకు ముందు పొత్తు మరోసారి దృఢపడే అవకాశం సానుకూలంగా తారసపడుతోంది. ఈ పరిస్థితిని సమయోచితంగా మలచుకునేందుకు బీజేడీ మాజీ అగ్రనేత బిజయ్ మహాపాత్రో తన కుమారుడు అరబింద మహాపాత్రోని బీజేడీ శిబిరంలో ప్రవేశింపజేయడం ఆయన రాజకీయ వ్యూహానికి ప్రతిబింబంగా నిలుస్తోంది. దివంగత ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్‌కు బిజయ్ మహాపాత్రో అత్యంత సన్నిహిత రాజకీయ నాయకుడు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, బీజేడీ కూటమి తథ్యమనేది స్పష్టం అయింది. అయితే సీట్ల సర్దుబాటు లెక్కలు తేలాల్సి ఉంది. ఏ క్షణంలోనైనా ఈ లెక్కలు ఖరారయ్యే అవకాశం ఉంది. ఈనెల 8వ తేదీన శుక్రవారం బీజేపీ, బీజేడీ సీట్ల సర్దుబాటు సమీకరణం బహిరంగం అవుతుందని సమాచారం.

మాట్లాడుతున్న కలెక్టర్ మహాజన్, వేదికపై అనసూయ, సరస్వతి తదితరులు



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



కార్యక్రమంలో పాల్గొన్న మహిళా సంఘాల ప్రతినిధులు

- కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్

రాయగడ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, వారి హక్కుల సాధనకు పోరాడాలని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. వాటిని సద్వినియోగపరుచుకుని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అయితే కొన్ని ప్రాంతాల్లో నిరక్ష్యరాస్యత కారణంగా మహిళలు ముందుకు వెళ్లలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో పరివర్తన వచ్చిందని దానికి అనుగుణంగా మహిళలు ముందుకు వెళ్లాలని సూచించారు. మహిళా సంస్థలు, సంఘాలు, క్లబ్‌లు వంటివి మహిళలను చైతన్యపరిచేందుకు ముందుకు రావాలన్నారు. అలాగే రాజకీయ రంగంలోనూ ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. మహిళల సర్వతోముఖాభివృద్ధి కోసం ఎంతగానో దోహదపడుతుందన్న ఉద్దేశంతో ప్రభుత్వం రాజకీయ రంగంలో రిజర్వేషన్లు కల్పించిందని గుర్తు చేశారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో మహిళ పాత్ర చాలా కీలకంగా మారుతుందన్నారు. మహిళలు చైతన్యవంతులైతే దేశం మరింత ముందుకు వెళ్తుందన్నారు. రాయగడ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శుభ్రపండ మాట్లాడుతూ మహిళలు విద్యావంతులవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌డీసీ చైర్మన్ అనసూయా మాఝి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, డీఎస్పీ బిజయ్ కుమార్ నొందనొ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ యువత అభివృద్ధికి కృషి చేస్తా



ఎమ్మెల్యే బాహిణీపతితో బ్రాహ్మణ సమాజ్ ప్రతినిధులు

- ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి

జయపురం: నిరుపేద, నిరుద్యోగ బ్రాహ్మణ యువత అభివృద్ధికి కృషి చేస్తానని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి తెలియజేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆయనను బ్రాహ్మణ సమాజ్ అధ్యక్షుడు శరత్ మిశ్ర నేతృత్వంలో ఉపాధ్యక్షుడు గోపీనాథ్ త్రిపాఠీ, సాధారణ కార్యదర్శి త్రిలోచన భట్, కిశోర్‌చంద్ర నరిడ, సదాశివ మిశ్ర, సూర్యనారాయణ పండ తదితరులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో బ్రాహ్మణ సామాజిక వర్గ కుటుంబాలు దుర్భర జీవితాలు గడుపుతున్నాయని తెలియజేశారు. అనేక మంది యువతీ యువకులు నిరుద్యోగులుగా ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. యువతకు ఉపాధి కల్పించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో బ్రాహ్మణుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, న్యాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఆశ కార్యకర్తల సేవలు ప్రశంసనీయం

రాయగడ:

ప్రజలకు ఆశ కార్యకర్తలు అందజేస్తున్న సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ అన్నారు. స్థానిక బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో ఆశ, ఆరోగ్య, గ్రామీణ కల్యాణ సమితుల వార్షిక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయి నుంచి పట్టణ ప్రాంతాల వరకు ప్రజలకు వైద్య సేవలు అందేందుకు నిరంతరం కృషి చేస్తున్న ఆశ కార్యకర్తల సేవలు అభినందనీయమన్నారు. కోవిడ్ వంటి విపత్కర సమయంలో ఆశ కార్యకర్తలు అందించిన సేవలు ఎప్పటికీ మరువలేమన్నారు. ప్రభుత్వం అమలు చేసే ప్రతీ సంక్షేమ పథకం సద్వినియోగమై ప్రజల వద్దకు చేరుకోగలుగుతుందంటే కేవలం ఆశ, ఆరోగ్య కార్యకర్తల కృషి ఫలితమేనన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో మన జిల్లా ఉత్తమ అవార్డును సంపాదించుకోవడంలో ఆశ కార్యకర్తల పాత్ర ముఖ్యమైనదన్నారు. వారి సేవలను గుర్తించిన ప్రభుత్వం 36 మంది ఆశ కార్యకర్తలను, అలాగే మరో 27 ఆరోగ్య కార్యకర్తలను సత్కరించిందని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్, ఏడీఎం పబ్లిక్ హెల్త్ డాక్టర్ లోక్‌నాథ్ రాజు, డాక్టర్ మమత సాహు, డాక్టర్ మమత చౌదరి, వైద్య శాఖ జిల్లా అడ్మినిస్ట్రేటర్ గౌర చంద్ర పటాన్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఆశ కార్యకర్తలు



ఆశ కార్యకర్తలను సన్మానిస్తున్న కలెక్టర్ మహాజన్ తదితరులు

మార్కెట్‌కు శివరాత్రి శోభ



గిరి మార్కెట్‌లో కిక్కిరిసిన జనం

- ఆకాశాన్ని తాకిన పూజా సామగ్రి ధరలు

హిందువుల అతి ముఖ్యమైన పండగల్లో మహాశివరాత్రి ఒకటి. శుక్రవారం శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని మార్కెట్లు గురువారం కిటకిటలాడాయి. దీంతో పూజా సామగ్రి ధరలు ఒక్కసారిగా అమాంతం పెరిగిపోయాయి. డజన్ అరటి పండ్లు రూ.70, యాపిల్ కిలో రూ.200, దానిమ్మ కిలో రూ.300 ఇలా పూజకు అవసరమైన అన్ని వస్తువుల ధరలు నింగిని తాకాయి. ముఖ్యంగా శివుడికి ఇష్టమైన ఒక్కొక్క మొగలి పువ్వు ధర రూ.200లు పలికింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కవిటి, ఇచ్చాపురం, కంచిలి, పలాస నుంచి వ్యాపారులు వచ్చి అమ్మకాలు సాగించారు.

- బరంపురం



పండ్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు



జోరుగా సాగుతున్న పండ్ల అమ్మకాలు



పువ్వుల అమ్మకాలు



చెరుకు అమ్మకాలు



మొగలి పువ్వుల అమ్మకాలు


వికటించిన పెళ్లి భోజనం



గ్రామంలో అస్వస్థతకు గురైనవారికి వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

- ఒకరు మృతి
- మరికొందరికి అస్వస్థత

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి చౌలామండీ పంచాయతీ బందుగూడ గ్రామంలో పెళ్లి భోజనం వికటించడంతో ఒక అమ్మాయి మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ధనవాలి అనే మహిళ తన నలుగురు పిల్లలతో కలిసి గ్రామంలో జరిగిన ఒక పెళ్లి వేడుకకు బుధవారం రాత్రి వెళ్లారు. అయితే అక్కడ భోజనాలు చేసి ఇంటికి వచ్చిన కొంతసేపటికి అందరికీ వాంతులు ప్రారంభమయ్యాయి. దీంతో స్థానికులు వెంటనే మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వారిలో చికిత్స పొందుతూ నలుగురు పిల్లల్లో ఒకరైన మఘిక (12) మృతి చెందింది. ప్రస్తుతం ముగ్గురు పిల్లలు, తల్లి పరిస్థితి విషమంగా ఉంది. విషయం తెలుసుకున్న ఆరోగ్య సిబ్బంది గ్రామానికి చేరుకొని భోజనాల్లో పాయిజన్ అయ్యిందనే అనుమానంతో వైద్య శిబిరం నిర్వహించారు. అప్పటికే మరికొందరికి వాంతులు, విరేచనాలు అవుతున్నట్లు గుర్తించారు. దీంతో వారందరికీ వైద్యం ప్రారంభించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ధనవాలి, పిల్లలు

కన్వీనర్‌గా ప్రసాద్ హరిచందన్


ప్రసాద్ హరిచందన్

భువనేశ్వర్: ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఓపీసీసీ) మాజీ అధ్యక్షుడు ప్రసాద్ హరిచందన్ ఒడిశా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల నిర్వహణ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలు, ఒడిశా రాష్ట్ర ఎన్నికలకు సన్నాహాల్లో భాగంగా రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కన్వీనర్‌గా మాజీ ఓపీసీసీ అధ్యక్షుడు, మాజీ మంత్రి ప్రసాద్ హరిచందన్ నియామకం తక్షణమే అమలు అవుతుందని ఒడిశా ఏఐసీసీ ఇన్‌చార్జి అజోయ్ కుమార్ గురువారం ప్రకటించారు. హరిచందన్ మీడియా, సోషల్ మీడియా, వార్ రూమ్, ప్రగమాన్, బీఎల్ఏ - 1, బీఎల్ఏ-2 పూర్తి చేయడం, రాజకీయ కార్యక్రమాల సమీకరణతో సమన్వయం, కమ్యూనికేషన్‌ను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

నిర్ణీత సమయానికి ముందే పనులు పూర్తి

- రాష్ట్ర ఆర్థిక శాఖ ఆదేశాలు

భువనేశ్వర్: ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ముగియడానికి సుమారు 20 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. అందువలన చివరి నిమిషం వరకు వేచి చూడకుండా ఆర్థిక క్రమశిక్షణ దృష్ట్యా నిర్ణీత సమయానికి ముందే ఆర్థిక కార్యకలాపాలను పూర్తి చేయాలని ఆర్థిక శాఖ ఆదేశించింది. ప్రభుత్వ శాఖలకు ఆర్థిక శాఖ ఈ మేరకు లేఖలు రాస్తోంది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 8, 26, 29న వరుసగా లేఖ రాసింది. ఆర్థిక సంవత్సరం చివరి రోజుల్లో ఖర్చుల వ్యవహారం కీలకంగా పేర్కొంది. నిధుల కేటాయింపు, నిధుల పునర్విభజన, సరెండర్, ఖజానాకు బిల్లుల సమర్పణ, నిధుల మంజూరుకు ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపడం తదితరాలకు గత నెల 8వ తేదీనే గడువుగా నిర్ణయించారు. అయితే వివిధ శాఖల ఇబ్బందుల దృష్ట్యా కాలపరిమితిని మరి కొంచెం పొడిగించారు. గత నెల 29న ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి అవస్తి కుమార్ దేవ్ ఖజానాలో బిల్లులు, ఇతర పనులకు తేదీ, సమయాన్ని ఖరారు చేస్తూ వివిధ శాఖలకు లేఖ రాశారు. ఇతర ఆకస్మిక నిధులు మరియు యంత్రాలు, పరికరాలు, వాహనాలు కొనుగోలు, నిర్వహణ, షేర్ క్యాపిటల్‌లో పెట్టుబడుల కింద క్లెయిమ్‌లకు సంబంధించిన అన్ని బిల్లులు, సహకార సంఘాలు, పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థలకు రుణం లేదా షేర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ లేదా సబ్సిడీ రూపంలో అందించే బడ్జెట్ మద్దతు బిల్లును ఈ నెల 11వ తేదీలోగా ట్రెజరీకి సమర్పించాలని ఆదేశించారు. సమర్పించిన పై బిల్లుల్లో వచ్చిన అభ్యంతరాన్ని సరిదిద్దిన తర్వాత ఈ నెల 16వ తేదీలోగా బిల్లును మళ్లీ సమర్పించాలని కోరింది. ఇతర బిల్లులను ఈ నెల 15వ తేదీలోగా సమర్పించాలని నిర్దేశించారు. లోపాలు ఉంటే బిల్లును సరిచేసి ఈ నెల 21వ తేదీలోగా మళ్లీ ట్రెజరీకి సమర్పించేందుకు గడువు మంజూరు చేసినట్లు ఆర్థిక శాఖ పలు ప్రభుత్వ శాఖలకు తెలిపింది.

అధికార తేజం

భద్రతే బాధ్యతగా..


ఎస్పీ రాధిక


అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్


డీఎస్పీ వై. శృతి

జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు మహిళా పోలీసు అధికారులు ఉత్తమసేవలందిస్తున్నారు. జిల్లా ఎస్పీగా జీఆర్ రాధిక, అదనపు ఎస్పీగా డాక్టర్ జి. ప్రేమ్ కాజల్, శ్రీకాకుళం డీఎస్పీగా వై.శృతి వారి వారి విధుల్ని సమర్థంగా నిర్వర్తిస్తున్నారు. జిల్లాలో ఎస్పీ నుంచి కానిస్టేబుళ్ల వరకు 114 మంది ఉన్నారు. వీరికి అదనంగా మహిళా హోంగార్డులు 81 మంది ఉన్నారు.
– శ్రీకాకుళం క్రైమ్

విధి నిర్వహణలో ప్రత్యేక మార్కు


తమీమ్ అన్సారియా, కమిషనర్

శ్రీకాకుళం నగరపాలక కమిషనర్ తమీమ్ అన్సారియా తనదైన శైలిలో విధుల్లో తన మార్కు వేసుకున్నారు. సమస్య ఎక్కడ ఉందంటే అక్కడ తక్కున వాలిపోయి పరిష్కారానికి చొరవ చూపిస్తున్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి అడుగులు వేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలను కాపాడటంలో తనదైన శైలిలో ముందుకు వెళ్తున్నారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌కు రెండో ఐఏఎస్ అధికారిణిగా విధుల్లో చేరారు. గతంలో శోభారాణి కమిషనర్‌గా కొంతకాలం పనిచేశారు.
శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)


60 శాతం మహిళలే


డాక్టర్ బి.మీనాక్షి, డీఎంహెచ్ఓ

జిల్లాలో ఐసీడీఎస్ తర్వాత అధిక సంఖ్యలో వైద్యారోగ్య శాఖలోనే మహిళలు విధుల్లో ఉన్నారు. క్షేత్ర స్థాయి నుంచి పై స్థాయి వరకు ఉన్న ఉద్యోగుల్లో 60 శాతానికి పైగా మహిళలే పనిచేస్తున్నారు. ఇలాంటి శాఖలో తోటి మహిళగా ఉన్నతాధికారిగా పనిచేయడం ఎంతో ఆనందంగా సంతృప్తిగా ఉంది. వైద్యుల్లో కూడా మహిళలు అగ్రభాగాన ఉన్నారు. జిల్లాలో మొత్తం 650 మందికి పైగా ఉద్యోగులంటే 380 మంది వరకు మహిళలే ఉన్నారు. – డాక్టర్ బి.మీనాక్షి, డీఎంహెచ్ఓ.
అరసవల్లి

శివ పూజకు వేళాయె..!

- ఏకామ్ర క్షేత్రంలో భారీ ఏర్పాట్లు
- రాత్రి 10 గంటలకు ఆకాశ దీప దర్శనం
- వేకువజామున 3 గంటల నుంచి సర్వదర్శనం


లింగరాజు దేవస్థానం


ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న డీసీపీ ప్రతీక్ సింఘ్ తదితరులు

భువనేశ్వర్: స్థానిక ఏకామ్ర క్షేత్రవాసుడు లింగరాజు ఆలయంలో మహా శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసినట్లు కమిషనరేట్ పోలీసులు తెలిపారు. నగర డీసీపీ ప్రతీక్ సింఘ్ ఈ ఏర్పాట్లను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు శివరాత్రి మహోత్సవం పురస్కరించుకుని దేవస్థానంలో ప్రత్యేక పూజాదులను సకాలంలో నిర్వహించాలని ఆలయ పాలక మండలి నిర్ణయించింది.

పటిష్ట భద్రత

మహా శివరాత్రి సందర్భంగా చారిత్రక పుణ్యక్షేత్రం వద్ద భారీ ఎత్తున భక్తులు తరలిరానున్న దృష్ట్యా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. 5 మంది అదనపు డీసీపీలు, 14 మంది ఏసీపీలు, 21 మంది ఇన్‌స్పెక్టర్లు, 84 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఏఎస్ఐలు, 45 మంది ఏపీఆర్ కానిస్టేబుల్స్, 21 మంది ఐఐసీలు, 48 మంది పోలీసులు, 93 యూనిట్ల స్పెషల్ ఫోర్స్, 112 మంది హోంగార్డులు భద్రత, ట్రాఫిక్ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు నియమించారు. నగర డీసీపీ ప్రతీక్ సింగ్ సింగ్ సమగ్ర భద్రత వ్యవస్థని పర్యవేక్షించనున్నారు. భక్తులు, సాధారణ ప్రజల రాకపోకలకు ఎటువంటి అంతరాయం లేకుండా ట్రాఫిక్ వ్యవస్థపై దృష్టి సారించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు

ట్రాఫిక్ సజావుగా సాగేందుకు నగరంలో పలుచోట్ల ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు, ప్రధాన కూడలి ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు వివిధ ప్రాంతాల్లో సివిల్ డ్రెస్‌లో పోలీసు సిబ్బందిని రంగంలోకి దింపుతున్నట్లు డీసీపీ వివరించారు. ఆకస్మిక అవాంఛనీయ సంఘటనల తక్షణ చర్యల కోసం ఒడ్రాఫ్ మరియు అగ్నిమాపక సిబ్బందిని కూడా మోహరిస్తామని డీసీపీ తెలిపారు. మహా శివరాత్రి ఉత్సవాలు సజావుగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ముందస్తు కార్యాచరణ ఖరారు చేశారు. లింగరాజు పూజా కార్యక్రమాలన్నీ నిర్ణీత సమయంలో సజావుగా నిర్వహించాలని అనుబంధ సేవాయత్ వర్గాలను అభ్యర్థించారు. వీరి సంప్రదింపుల మేరకు ఖరారైన వేళల ప్రకారం మహా శివరాత్రి నాడు రాత్రి 10 గంటలకు లింగరాజు ఆలయం శిఖరాన మహా దీప దర్శనం ఏర్పాటు చేస్తారు.

ఉత్సవ పూజలు

శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి 3.30 గంటల మధ్య లింగరాజుకు మంగళ హారతి, అబకాశ కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం తెల్లవారు జామున 3.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సర్వ దర్శనం కల్పిస్తారు. తదుపరి మధ్యాహ్నం 12.45 గంటల వరకు మహాస్నానం, అలంకరణ క్రతువులు జరుగుతాయి. ఆ తర్వాత మధ్యాహ్నం 12.45 గంటల నుంచి 2.30 గంటల వరకు సూర్య పూజ, ద్వారపాలక పూజ, దూపసేవ నిర్వహిస్తారు. అదేవిధంగా మధ్యాహ్నం 2.45, రాత్రి 7.10, 7.30, 8.10, 8.55 గంటలకు భోగ మండప, సంధ్యా హారతి, శుద్ధి, జాత్ర పూజ, ప్రాకార సేవ, సంధ్యా ధూప క్రతువులు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాల తర్వాత లింగరాజు ఆలయ శిఖరాన రాత్రి 10 గంటలకు మహా దీపం ఏర్పాటు చేస్తారు.

మహిళలను గౌరవించాలి


సిబ్బందిని సత్కరిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: ఇంటా బయట పలు రంగాల్లో బహుముఖ ప్రజ్ఞ ప్రదర్శిస్తున్న మహిళలను గౌరవించాలని తూర్పు కోస్తా రైల్వే శ్రామిక్ కాంగ్రెసు శాఖా కార్యదర్శి లక్ష్మీధర మహంతి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఖుర్దారోడ్ మండల రైల్వేస్టేషనులో విధులు నిర్వహిస్తున్న మహిళా కార్యకర్తల ఆధ్వర్యంలో పలు చైతన్య, సందేశాత్మక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైళ్ల నిర్వహణ, ప్రయాణికుల సౌకర్యాల కల్పన వంటి కీలకమైన విభాగాల్లో విజయవంతంగా విధులు నిర్వహిస్తున్న మహిళా సిబ్బందికి ఉత్తరీయంతో సత్కరించారు.

రైల్వే వీధుల్లో పలు ప్రదర్శనలతో మహిళా దినోత్సవంపై చైతన్యం కల్పించారు. అంతర్జాతీయ మహిళా దినం ఈనెల 8న మహాశివ రాత్రి కావడంతో ఒకరోజు ముందుగా ఈ కార్యక్రమం నిర్వహించేందుకు తూర్పు కోస్తా రైల్వే శ్రామిక్ కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి రమేష్ చంద్ర సాహు పిలుపునిచ్చారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పోటీలు



మాట్లాడుతున్న ఎస్‌డీసీ చైర్మన్ మాఝి

రాయగడ: స్థానిక మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అటానమస్ కళాశాలలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థుల మధ్య వివిధ పోటీలను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రత్యేక అభివృద్ధి మండలి చైర్మన్ అనసూయ మాఝి హాజరయ్యారు. గౌరవ అతిథులుగా ఏడీఎం పబ్లిక్ హెల్త్ డాక్టర్ మమత చౌదరి, మున్సిపల్ వైస్ చైర్మన్ శుభ్రాపండ, కళాశాల ప్రిన్సిపల్ బబిలత షరఫ్‌లు హాజరయ్యారు. మహిళల ప్రాముఖ్యత, వారి హక్కుల గురించి వక్తలు ప్రసంగించారు. అనంతరం పోటీల్లో గెలిపొందిన వారికి బహుమతులను అందజేశారు. క్లబ్ అధ్యక్షురాలు కె.రజిత, సాధారణ కార్యదర్శి కె.భారతీల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

కౌలాలంపూర్ విమాన సర్వీసు పునఃప్రారంభం

భువనేశ్వర్: కౌలాలంపూర్‌కు విమానయాన సేవలు పునరుద్ధరిస్తున్నారు. ఈ ఏడాది మే 28 నుంచి వారానికి 3 సార్లు భువనేశ్వర్ – కౌలాలంపూర్ మధ్య తిరిగి ప్రారంభించనున్నట్లు ఎయిర్ ఏషియా ప్రకటించింది. మలేషియా, భారతదేశం మధ్య ఎయిర్ కనెక్టివిటీని పెంచేందుకు ఈ మేరకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. మలేషియా నుంచి దేశంలోని పలు ప్రాంతాలకు వివిధ మార్గాల్లో ప్రత్యక్ష విమానయాన సేవలు కల్పించి పెద్ద సంఖ్యలో పర్యాటకుల్ని ఆకట్టుకునేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఎయిర్‌ఏషియా ఏవియేషన్ గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బో లింగం తెలిపారు. భువనేశ్వర్‌కు కౌలాలంపూర్ విమానాల పునః ప్రారంభం దృష్ట్యా, విమానయాన సంస్థ మార్చి 17 వరకు ప్రారంభ టిక్కెట్ ధర కేవలం ఆర్ఎం 199 (రూ. 3,494.03). తదుపరి మే 28 మరియు జూన్ 18 మధ్య భువనేశ్వర్ మరియు మలేషియా రాజధాని నగరం మధ్య ప్రయాణ చార్జీ రూ. 4,999గా ప్రకటించారు.

మహిళా కళాశాల 5, 6 సెమిస్టర్ల ఫలితాలు వెల్లడి

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల విద్యార్థుల 5, 6 సెమిస్టర్ల రెగ్యులర్, సప్లమెంటరీ ఫలితాలను గురువారం ప్రిన్సిపాల్ కింతలి సూర్యచంద్రరావు వెలువరించారు. 87.98 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. బీఏలో 89.23 శాతం, బీఎస్సీలో 83.77 శాతం, బీకాం జనరల్‌లో 100 శాతం, బీకాం ఒకేషనల్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి, అసిస్టెంట్ కంట్రోలర్ పీఏస్ కనకదుర్గ, వై.ప్రశాంతి, సీహెచ్ కాత్యాయని, వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకరనారాయణ, అకడమిక్ కోఆర్డినేటర్ చింతాడ కృష్ణారావు, ఎస్.పద్మావతి పాల్గొన్నారు.

రూ 33.50 లక్షలతో సెంట్రల్ లైటింగ్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగ రాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్ది కాంతులు విరజిమ్మేలా చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలో పసగాడ మిల్లు జంక్షన్ నుంచి సూర్యమహల్ కూడలి వరకు రూ 33.50 లక్షలతో చేపట్టిన సెంట్రల్ లైటింగ్‌ను గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ తమీమ్ అన్సారియా, శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డి.పి.దేవ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, ఎం.ఎస్.కె, చల్ల శ్రీను, మండవల్లి రవి, అంధవరపు రమేష్, పి.సుగుణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీల పక్షపాతి సీఎం జగన్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బీసీల పక్షపాతి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కళింగ వైశ్య, భేరి వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏలూరు బీసీ గర్జనలో బీసీ డిక్లరేషన్ ఇచ్చిన జగన్ వాటిని అమలు చేసిన విధానం, 2019 మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు పరిచిన అంశాలను, 2014లో టీడీపీ మ్యానిఫెస్టోలోని అంశాలను, చంద్రబాబునాయుడు-పవన్ కళ్యాణ్‌ల జయహో బీసీలోని అంశాలను చైతన్యవంతమైన బీసీలు తెలుసుకోలేనంత అమాయకులు కాదని స్పష్టం చేశారు.

ఆమేయం





శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళానికి దగ్గరలో ఉన్న సింగుపురం గ్రామంలో ఉంటున్న దూసి అన్నపూర్ణ సేంద్రీయ వ్యవసాయంలో పట్టు సాధించి నూతన వంగడాల పరిశోధనలో కృషి చేస్తున్నారు. లాయర్‌గా కూడా ఆమె సేవలందిస్తున్నారు. శ్రీకాకుళంలోని ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ప్రైవేటు లిమిటెడ్ అనే సంస్థను స్థాపించి 100 మందికి పైగా రైతులను సభ్యులుగా చేర్చారు. సాగు పద్ధతులు మార్చేందుకు తన వంతుగా కృషి చేస్తున్నారు. సీజీటీ సభ్యులకు విత్తనాలు, ద్రవ జీవామృతం, సేంద్రీయ ఫెర్టిలైజర్లు మొదలైన ఉత్పత్తులను అందిస్తున్నారు. ఆమె పుట్టిన రోజు కూడా మార్చి 8 కావడం విశేషం.

ఆమె గళమున..



పొందూరు మండలం గోకర్ణపల్లి గ్రామానికి చెందిన రోణంకి మీనాక్షి తెలుగు అధ్యాపకురాలిగా పొందూరులోని ఒక ప్రైవేటు కళాశాలలో పనిచేస్తున్నారు. ఈ కాలంలో కూడా ఆమె హరికథలకు జీవం పోస్తున్నారు. ఎనిమిదేళ్ల వయసు నుంచి కళపై ఉన్న ఇష్టంతో కొనసాగిస్తున్నారు. శివలీలలు, సీతారామ కల్యాణం, నర్తనశాల, కృష్ణరాయభారం, హనుమత్ సత్యాగ్రహం, శ్రీనివాస కల్యాణం, పందిరిపాట కథలైన ధర్మాంగధర చరిత్ర, గంగా దేవి కల్యాణం, శశిరేఖా పరిణయం, లక్ష్మణమూర్చ, సత్యహరిశ్చంద్ర కథలు పాడుతారు.

నాట్య మయూరి



నాలుగు దశాబ్దాల నృత్య ప్రస్థానం. 40కుపైగా దేశాల్లో ప్రదర్శనలు. 13 నృత్య రూపకాల (బ్యాలెట్స్) రూపకర్తగా ఖ్యాతి. సంప్రదాయ కూచిపూడి గురుకులానికి అధినేతగా గుర్తింపు.. వెరసి స్వాతీ సోమనాథ్. జిల్లాకు చెందిన ఆమె 1980లో కూచిపూడిలో అరంగ్రేటం చేశారు. సుమతి కౌసిల్ వద్ద మొదట నేర్చుకున్నారు. కూచిపూడిలో ఎంఫిల్ ఉస్మానియా యూనివర్సిటీలో, ఎంపీఏ కూచిపూడిని సెంట్రల్ యూనివర్సిటీలో చేశారు. నాట్యమే ఊపిరిగా బతుకుతూ నృత్యరీతిని కాపాడుతున్నారు.

సేవా స్ఫూర్తి..



మదర్ థెరిసా స్ఫూర్తితో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు అరసవల్లికి చెందిన డి.హేమలత. చిన్న నాటి స్నేహితులతో కలసి హెల్పింగ్ హ్యాండ్స్ అనే స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేశారు. సంస్థ తరఫున పేదవారికి ఆహారం, కేన్సర్ రోగులకు వైద్యం, వికలాంగులకు, వితంతువులకు షాపులు పెట్టించి స్వయం ఉపాధి కల్పిస్తున్నారు. ఈమె ప్రస్తుతం గార మండలం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు సుమారుగా రూ.10లక్షలు ఖర్చు చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.

'కాంగ్రెస్ విజయానికి సమష్టిగా పనిచేద్దాం'


ప్రసంగిస్తున్న డీసీసీ అధ్యక్షుడు పాత్రో


సమావేశంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

జయపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి సమష్టిగా పనిచేద్దామని డీసీసీ నూతన అధ్యక్షుడు శశిభూషణ పాత్రో కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక బాబాసాహెబ్ కల్యాణ మండపంలో కొరాపుట్ జిల్లాస్థాయి కాంగ్రెస్ శ్రేణుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శశిభూషణ పాత్రో మాట్లాడుతూ.. పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు. ఎన్నికల్లో జిల్లాలో 5 ఎమ్మెల్యే స్థానాలతో పాటు ఎంపీ స్థానాన్ని గెలుచుకొని పార్టీకి పూర్వవైభవం తీసుకొద్దామన్నారు. ఈనెల 12వ తేదీన ఒడిశా రాష్ట్ర పరిశీలకుడు డి.అజయ కుమార్, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శరత్ కుమార్ పట్నాయిక్, రాష్ట్ర కాంగ్రెస్ ప్రచార కమిటీ అధ్యక్షుడు బిజయ కుమార్ పట్నాయక్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు మీనాక్షీ బాహిణీపతి తదితరులు జయపురం వస్తున్నట్లు తెలియజేశారు. దీంతో వారికి ఘన స్వాగతం పలికేందుకు కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరవ్వాలని కోరారు. అలాగే ఆరోజు పార్టీ శ్రేణులతో బహిరంగ సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశం విజయవంతంగా జరిపేందుకు తగు ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, డీసీసీ ఉపాధ్యక్షుడు బినోద్ మహపాత్రో, మదన మోహన్ నాయక్, కోట్‌పాడ్ ఎస్ఏసీ అధ్యక్షుడు శంకరరావు, బొరిగుమ్మ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్ గంతాయిత్ తదితరులు పాల్గొన్నారు.

దశదిశలా ప్రగతి

- ప్రభుత్వ పథకాల్లో మహిళలకు భాగస్వామ్యం భేష్
- 'సాక్షి' టాక్ షోలో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు



టెక్కలి:

మొబైల్‌లో ఫేస్‌బుక్ ఉన్నా లేకున్నా దిశ యాప్ మాత్రం ఉండాలి. అమ్మానాన్నలకు ఆర్థిక స్తోమత లేకున్నా ఆడపిల్ల చదువు మాత్రం కొనసాగాలి. డిగ్రీ పట్టాలు అందుకోకపోయినా మహిళలకు ఆర్థిక స్వాతంత్య్రం మాత్రం కావాలి.. టెక్కలి డిగ్రీ కాలేజీ విద్యార్థినుల మనోభావాలివి. అతివల అభివృద్ధికి ప్రభుత్వం అడుగడుగునా అండగా నిలుస్తున్న నేపథ్యంలో కాలేజీలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో 'సాక్షి' టాక్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తమ మనోగతాన్ని ఇలా వ్యక్తపరిచారు.

ఫేస్‌బుక్ కంటే..

ఆడపిల్లలు మొబైల్‌లో స్నాప్ చాట్, ఫేస్ బుక్ కంటే దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం ఎంతో ఉత్తమం. ఇలాంటి రక్షణ యాప్‌ను అందజేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు. – బి.గౌతమి, డిగ్రీ విద్యార్థిని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి.

దిశతో ఎంతో మేలు



ప్రభుత్వం రూపకల్పన చేసిన దిశ యాప్ మహిళలు, బాలికల సంరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతోంది. దిశ యాప్ ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలి. – జి.డిల్లేశ్వరి, డిగ్రీ విద్యార్థిని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి.

బాల్య వివాహాలు తగ్గాయి



ఒకప్పుడు ఆడపిల్లలకు బాల్య వివాహాలు చేసి వారికి భవిష్యత్ లేకుండా చేసేవారు. ఇప్పుడు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో బాల్య వివాహాలు తగ్గుముఖం పట్టాయి. అంతే కాకుండా ఆడపిల్లలు స్వేచ్ఛగా చదువుకుంటున్నారు. – ఎస్.హారిక, డిగ్రీ విద్యార్థిని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి.

ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది



ఒకప్పుడు మా గ్రామాల్లో చదువుకునే ఆడపిల్లలు ఎంతో తక్కువగా ఉండేవారు. ఇప్పుడు ప్రతి ఆడపిల్లను చదివిస్తున్నారు. ఇదంతా ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహమే. – ఎస్.మంజుల, డిగ్రీ విద్యార్థిని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి.

టాక్ షో సాక్షి Talk Show

ప్రభుత్వ చర్యలు బాగున్నాయి



బాలికల విద్య కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఎంతో బాగున్నాయి. వారి చదువుకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉండేందుకు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మఒడి పథకాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. మహిళలు, బాలికల రక్షణ కోసం దిశ యాప్ ప్రత్యేకంగా చెప్పాలి. – డాక్టర్ వైవీసీహెచ్ లీలాపద్మజ, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి

అతివల అభ్యున్నతి



మహిళా సాధికారత దిశగా విద్యా సంస్థల్లో ఉమెన్ ఎంపవర్‌మెంట్ ద్వారా చేస్తున్న కార్యక్రమాలు ఎంతో బాగున్నాయి. గతం కంటే ఇప్పుడు బాల్య వివాహాలు ఎంతో తగ్గుముఖం పట్టాయి. – రోషిణి పట్నాయక్, డిగ్రీ విద్యార్థిని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి.


● ప్రతి రోజూ మహిళా దినోత్సవమే


మహిళా దినోత్సవంలో సత్కారాలు

శ్రీకాకుళం అర్బన్: విద్య ద్వారా సమాజంలో సమూల మార్పులు వస్తాయని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. శ్రీకాకుళం అంబేడ్కర్ ఆడిటోరియంలో శ్రీకాకుళం జిల్లా స్త్రీ, మహిళ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో శ్రీకాకుళం నగర పాలక సంస్థ కమిషనర్ తమిమ్ అన్సారియాతో కలిసి ఆమె పాల్గొన్నారు. మార్చి 8 మాత్రమే కాదు ప్రతిరోజు మహిళా దినోత్సవమేనని అన్నారు. అతివలు అభివృద్ధి చెందిన నాడు సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు.

శ్రీకాకుళం నగర పాలక సంస్థ కమిషనర్ తమీమా అన్సారియా మాట్లాడుతూ స్త్రీ అభివృద్ధి దేశ అభివృద్ధికి కీలకమన్నారు. ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ మాట్లాడుతూ జిల్లాలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, సూపర్‌వైజర్లు కలిపి 6050 మంది వరకూ మహిళలు ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రజని, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, శ్రీకాకుళం మున్సిపల్ మాజీ చైర్మన్ ఎంవీ పద్మావతి, అంగన్‌వాడీ సీడీపీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వ విద్యాలయంలోనూ..


కేఆర్ రజిని

జిల్లాలో ఉన్నత విద్యా సంస్థ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయానికి కూడా ఓ మహిళ వైస్ చాన్స్‌లర్‌గా ఉన్నారు. ప్రొఫెసర్ కేఆర్ రజిని వర్సిటీని ముందుండి నడిపిస్తున్నారు. ఆమెను జనవరి 18న బాధ్యతలు స్వీకరించారు. మహిళలు నిర్ణయాధికారం, సాధికారత రెండింటికీ ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె చెబుతున్నారు. సమాజం గర్వపడేలా మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని చెప్పారు. – ఎచ్చెర్ల క్యాంపస్

క్లుప్తంగా

పోక్సో కేసులో ముద్దాయికి ఏడేళ్ల జైలు శిక్ష

పార్వతీపురంటౌన్: పోక్సో కేసులో ముద్దాయికి ఏడేళ్ల జైలు శిక్షను విధిస్తూ విజయనగరం ప్రత్యేక పోక్సో కోర్టు జడ్జి కె.నాగమణి తీర్పు వెలువరించినట్లు పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 12 జనవరి 2021 సంవత్సరంలో సాలూరు మండలంలోని మామిడిపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఎనిమిదేళ్ల బాలికపై లైంగికదాడినట్లు పాల్పడినట్లు బాధితురాలి బంధువుల ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన పెరుమళ్ల రమణయ్య కేసు నమోదైంది. ఈ కేసులో త్వరితగతిన పోలీసులు విచారణ చేపట్టి వాస్తవాలను కోర్టుకు సమర్పించారు. ఈ మేరకు విచారణ జరగడంతో నేరం నిర్ధారించిన కోర్టు పై విధంగా తీర్పు వెలువరించినట్లు ఎస్పీ వివరించారు.

శ్రీశైలంలో నృత్యప్రదర్శన

విజయనగరం టౌన్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని విజయనగరంలోని 'అభినయ ప్రియ' నర్తనశాల ఆధ్వర్యంలో సాయిసుప్రియ నిర్వహించిన భరతనాట్య నృత్యప్రదర్శన ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. తన శిష్యబృందంతో కలిసి ఎనిమిదేళ్లుగా శ్రీశైలంలో భరతనాట్య ప్రదర్శన ఇస్తున్నట్లు జిల్లాకు చెందిన సుప్రియ గురువారం తెలిపారు. ఆలయ ఈఓ పెద్దిరాజు, పీఆర్‌ఓ శ్రీనివాస్‌లు చేసిన సత్కారం మరువలేనిని సంతోషం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థినుల తల్లిదండ్రులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

సీనియర్స్ కబడ్డీ పోటీలకు జిల్లా జట్టు పయనం

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సీనియర్స్ పురుషుల కబడ్డీ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు గురువారం పయనమైంది. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకూ నెల్లూరు జిల్లా కోవూరులో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లేముందు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు అవనాపు విజయ్‌ను క్రీడాకారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. రాష్ట్రస్థాయిలో జిల్లాఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు.

సారా తయారీ శిబిరాలపై దాడి

లక్కవరపుకోట: మండలంలోని రేగ పంచాయతీ నీలకంఠాపురం గ్రామం సమీపంలో రహస్యంగా నడుస్తున్న సారా తయారీ శిబిరాలపై ఎల్.కోట ఎస్సై గోపాలరావు ఆధ్వర్యంలో పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సారా తయారీకి సిద్ధంగా డ్రమ్ముల్లో నింపిన పులిసిన బెల్లాన్ని గుర్తించి సుమారు 15వందల లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. అనంతరం డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో పోలీసుల రాకను గమనించిన తయారీ దారులు పరారయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల వద్ద నిఘా పటిష్టం

పార్వతీపురంటౌన్: అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల వద్ద నిఘా మరింత పటిష్ట పరిచామని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన పార్వతీపురం సరిహద్దు గ్రామమైన అడారు అంతర్రాష్ట్ర చెక్ పోస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో ఒడిశా రాష్ట్రం నుంచి సారా, గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి నిఘా పెంచామని తెలిపారు. ఒడిశా రాష్ట్రం నుంచి వస్తున్న ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించినట్లు చెప్పారు. చెక్‌పోస్టుల సిబ్బంది అప్రమత్తంగా ఉండి అనుమానం కలిగినా, ముందస్తు సమాచారం ఉన్నా తక్షణమే అధికారులకు సమాచారం చేరవేయాలని సూచించారు.

మహిళలు స్వీయభద్రతపై దృష్టి సారించాలి

విజయనగరం అర్బన్: స్వీయ భద్రతపై ప్రతి మహిళ దృష్టి సారించాలని కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీకట్టిమణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన 'మహిళల ఆర్థికాభివృద్ధికి పెట్టుబడి పెట్టండి: ప్రగతిని వేగవంతం చేయండి' అనే అంశంపై స్థానిక గిరిజన యూనివర్సిటీ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ విజయాలను స్ఫూర్తిగా తీసుకోవడానికి ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారన్నారు. మహిళలు శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కొగల సత్తా కలిగి ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థినులకు ఆత్మరక్షణ/స్వీయరక్షణపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. యూనివర్సిటీ అంతర్గత ఫిర్యాదు కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ పరికిండ్ల శ్రీదేవి ఆధ్వర్యంలో కరాటే జాతీయ స్థాయి బ్లాక్‌బెల్ట్, జాతీయ రిఫరీ గౌరీశంకర్ విద్యార్థినులకు ఆత్మరక్షణకు సంబంధించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం శిక్షకులకు వీసీ జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రేమ్‌ఛటర్జీ, డాక్టర్ దివ్య కొనికల్, డాక్టర్ లత కల్యంపూడి, డాక్టర్ కుసుమ్ తదితర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆమెలో.. సంక్షేమ సంతోషం

ఆమె నవ్వితే అందం.. ఇంటిళ్లపాదికి ఆనందం... లక్ష్మీ రూపిణిగా ఓ ప్రత్యేక స్థానం. అమ్మగా, అక్కగా, చెల్లిగా, ఆలిగా అడుగడుగునా ఆత్మీయతను పంచే అద్భుతమూర్తి. ఓర్పు, నేర్పు ఆమె సొంతం. ఐదేళ్లుగా రాష్ట్రంలోని మహిళలకు సరైన ప్రాధాన్యం లభించింది. అన్నింటా ప్రభుత్వం అండగా నిలిచింది. ఆమెకే తొలి ప్రాధాన్యం ఇచ్చింది. ఆది శక్తికి ఆర్థిక, రాజకీయ, విద్యా, రక్షణ శక్తిని తోడుచేసింది. స్వావలంబన దిశగా నడిపించింది. నిజమైన మహిళా దినోత్సవాన్ని అందించి అందరిలో ఆనందం నింపింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె 'సంక్షేమ' ఆనందాన్ని మాటల్లో విందాం.

- ఐదేళ్ల పాలనలో అన్నింటా మహిళలకే ప్రాధాన్యం
- ఆర్థిక స్వావలంబన దిశగా 'ఆమె'
- మహిళల్లో ఆర్థిక వెలుగులు
- మారిన జీవన ప్రమాణాలు
- ఇదే నిజమైన మహిళా దినోత్సవం అంటున్న మగువలు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ఆర్థిక సంతోషం



మాది బొబ్బిలి మండలంలోని ఆరికతోట. మదర్‌థెరీసా పొదుపు సంఘంలోని సభ్యురాలిని. 2019లో రూ.7లక్షల బ్యాంకు రుణం తీసుకున్నాం. కేవలం రూ.60వేలు మాత్రమే కట్టాం. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ముఖ్యమంత్రి మంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రుణాలు మాఫీ చేశారు. దీంతో మా సంఘ సభ్యులకు రూ.6లక్షల40వేలు ఆర్థిక ప్రయోజనం కలిగింది. చిరువ్యాపారాలు చేస్తూ కుటుంబానికి అండగా నిలుస్తున్నాం. మహిళా 'సంక్షేమం' అంటే ఇదే కదా. మహిళలు బాగుండాలని కోరుకునే నాయకుడు పాలకుడు కావడం మా అదృష్టం.

– యజ్జల రత్నమ్మ, మదర్ థెరీసా మహిళా సంఘం సభ్యురాలు, ఆరికతోట

చదువుకు అండ



మాది వ్యవసాయ కూలీ కుటుంబం. రెక్కాడితే గాని డొక్కాడదు. ఆడ పిల్లలను చదివించలేం అనుకున్నాం. అదే సమయంలో జగగనన్న ముఖమంత్రి అయ్యారు. పిల్లలకు అమ్మఒడి కింద చదువు సాయం అందించారు. పాఠశాలను అందంగా ముస్తాబు చేసి చదువుల నిలయంగా తీర్చిదిద్దారు. జగనన్న విద్యాకానుకల పేరుతో అభ్యసన సామగ్రిన్ని సమకూర్చారు. పిల్లలు చక్కగా చదువుకుంటున్నారు. అమ్మగా ఇంతకంటే ఇంకేమి సంతోషం ఉంటుంది. ఇదే నాకు నిజమైన మహిళా దినోత్సవం.

– కుమార్తె అనూషతో తల్లి రంధి బుజ్జి

జీవనానికి 'చేయూత'



నా పేరు పొండ్రంకి అప్పలపైడితల్లి. విజయనగరం మండలం చెల్లూరు గ్రామం. భర్త 15 ఏళ్ల కిందట మరణించారు. గ్రామంలోనే చిన్న అద్దె గదిలో ఒంటరిగా జీవించేదానిని. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక నా జీవితంలో 'నవరత్న' వెలుగులు వికసించాయి. ప్రతినెలా ఠంచన్‌గా రూ.3వేలు చొప్పున వృద్ధాప్య పింఛన్ అందుతోంది. వైఎస్సార్ చేయూత కింద ఏటా రూ.18,750 చొప్పున నా ఖాతాలో జమయ్యాయి. ఈ మొత్తంతో కూరగాయల వ్యాపారం ప్రారంభించి ఆనందంగా జీవిస్తున్నా. సొంత బిడ్డల కంటే ఎక్కువగా తనలాంటి ఒంటరి మహిళల జీవితాలకు భరోసా కల్పించిన జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. మాకు ఇదే నిజమైన మహిళా దినోత్సవం.

విద్యానందం



నా పేరు వలిరెడ్డి రాజేశ్వరి. గరివిడి శ్రీరామ్ నగర్ కాలనీలో ఉంటున్నాం. తల్లిదండ్రులు కూలీలు. జగన్ మోహనరెడ్డి ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయంతోనే గరివిడి అవంతి సెయింట్ థెరీసా ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తిచేశాను. నాలుగేళ్లు జగనన్న విద్యాదీవెన పేరుతో ఏటా రూ.41వేలు చొప్పున తల్లి ఖాతాలో ప్రభుత్వం జమ చేసింది. పూర్తిఫీజు రీయింబర్స్ మెంట్ వర్తించడంతో చక్కగా చదువుకోగలిగాను.

పాలనకు అవకాశం



నేను గిరిజన రైతును. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి మహిళలకు ఉద్యోగాలు, పదవుల్లో రిజర్వేషన్ కల్పించడంతో సర్పంచ్‌గా అవకాశం దక్కింది. సంక్షేమ పథకాల ఆర్థిక ప్రయోజనాలన్నీ మహిళల ఖాతాల్లో జమచేస్తూ సమాజంలో గౌరవం పెంచారు. ఇదే మహిళలకు నిజమైన ఉత్సవం.

– గొర్లె సత్యవతి, మహిళా రైతు,సారిక సర్పంచ్, సాలూరు మండలం

మనోధైర్యానికి మించిన ఆయుధం లేదు



మహిళలు మనోధైర్యంతో ముందుకు సాగాలి. అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా పక్షపాతిగా నిలుస్తోంది. దిశ యాప్ మహిళలకు రక్షణ కవచంగా నిలుస్తోంది. స్వేచ్ఛగా జీవించే అవకాశం లభించింది.

– ఎం.దీపిక, ఎస్పీ, విజయనగరం

20 ఏళ్ల తరువాత రిజర్వేషన్‌తో అవకాశం



జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళలుకు స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించారు. ఈ కారణంగా 20 ఏళ్ల తరువాత మా గ్రామ పంచాయతీకి మహిళా రిజర్వేషన్ సర్పంచ్ పదవికి లభించింది. సర్పంచ్‌గా ఉత్తమ పాలన అందించేందుకు అవకాశం కలిగింది. ప్రభుత్వ కృషితో మహిళలకు సమాజంలో గౌరవం, సమానత్వం సమకూరింది.

– వావిలపల్లి ధనలక్ష్మి, సర్పంచ్, కాకరాపల్లి గ్రామ పంచాయతీ, సంతకవిటి మండలం



సాలూరులో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ ర్యాలీ

మహిళలకు గౌరవం పెరిగింది



వైఎస్సార్‌సీపీ పాలనలో ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళలను గౌరవిస్తూ అన్నింటా ప్రాధాన్యమిచ్చారు. ఆర్థిక స్వావలంబన కల్పించారు. రాజకీయ రంగంలో మహిళలను ప్రోత్సహించారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం అయితేనే ఆయా కుటుంబాలు బాగు పడతాయని గుర్తించి ఎక్కువ సంక్షేమ పథకాలకు మహిళలనే లబ్ధిదారులుగా గుర్తించారు. అందుకే.. ఆర్థిక, రాజీకయ రంగాల్లో మహిళలే మహరాణుల్లా ఉన్నారు.

– పాముల పుష్పశ్రీవాణి, ఎమ్మెల్యే, కురుపాం

మహిళా లోకాన్ని ప్రోత్సహించేలా..



రాష్ట్రంలో ప్రతిమహిళా తన తోబుట్టువుగా భావించి, మహిళా లోకాన్ని అర్థికంగా, రాజకీయంగా ప్రోత్సహిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి. గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో అధికశాతం అక్కచెల్లమ్మల పేరిటే అమలవుతున్నాయి. ముఖ్యంగా అమ్మఒడి, ఆసరా, రుణమాఫీ వంటి పథకాలతో పాటు జగనన్న ఇళ్ల పట్టాలను లక్షలాది మంది అక్కచెల్లెమ్మల పేరిట అందించి సమాజంలో మహిళల స్థాయిని పెంచారు. రూ.లక్షల విలువ చేసే ఆస్తిని మహిళల పేరుతో అందించారు. మహిళా సాధికారతకు పెద్దపీటవేశారు. అందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకంక్షలు.

– విశ్వాసరాయి కళావతి, పాలకొండ ఎమ్మెల్యే

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి



ఎక్కడైతే మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ముందంజలో ఉంటారో ఆ రాష్ట్రం, దేశం ప్రగతి పథంలో పయనిస్తోంది. మహిళలకు నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించి జగన్‌మోహన్‌రెడ్డి సముచిత గౌరవం ఇచ్చారు. 4.65 కోట్ల మంది మహిళల ఖాతాలకు నేరుగా సంక్షేమ పథకాల లబ్ధిని చేర్చారు. మహిళా పక్షపాతిగా నిలిచారు.

– నల్లబిల్లి సుహాసిని, వీరఘట్టం

భద్రత 'దిశ'గా..



మహిళల రక్షణ కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహనరెడ్డి మన రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన దిశ చట్టం పటిష్టంగా అమలవుతుండడం మా అదృష్టం. ఈ చట్టం వల్ల మహిళలు స్వేచ్ఛగా తమ విధులు నిర్వర్తించగలుగుతున్నారు. మహిళల భద్రతకు భరోసా కలిగింది.

– భోగి లత, డైరెక్టర్, స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్, వీరఘట్టం

మైలాన్‌లో విష వాయువు లీక్ ?

- పలువురు కార్మికులకు అస్వస్థత
- విపత్తును సమర్థంగా ఎదుర్కొన్న యంత్రాంగం

పూసపాటిరేగ: మండలంలోని ఓ రసాయన పరిశ్రమలో ఉదయం 10 గంటల సమయంలో స్టోరేజీ ట్యాంకు నుంచి ట్యాంకర్‌లోకి రసాయనాన్ని ఎక్కిస్తుండగా, అన్‌లోడింగ్ వాల్వ్ వద్ద రసాయనం కొద్దిగా లీక్ అయింది. అదే సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ వేడికి గ్యాస్‌కట్ కరిగిపోయిన కారణంగా సమీపంలో 50 కిలోలు అమోనియా సిలిండర్‌కు జతచేసి ఉన్న పైప్‌లైన్ నుంచి ఒక్కసారిగా ప్రమాదకరమైన అమోనియా గ్యాస్ లీకైంది. ఇది వ్యాపించి అక్కడ పనిచేస్తున్న సిబ్బందిపై తీవ్ర ప్రభావం చూపించింది. లీకైన గ్యాస్ పరిశ్రమ దక్షిణ దిశగా 1.5 కిలో మీటర్ల దూరంలోని చోడమ్మఅగ్రహారం వైపు ప్రయాణించింది. గ్యాస్ లీకైన వెంటనే దీనిని గుర్తించిన భద్రతా పరికరాలు సిబ్బందిని హెచ్చరిస్తూ అలారం మోగించాయి. అంతే ఒక్కసారిగా కార్మికులు భయభ్రాంతులకు గురై పరుగులు తీయడంతో పరిశ్రమలో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో ఫ్యాక్టరీ భద్రతా విభాగం హుటాహుటిన రంగంలోకి దిగి ప్రమాద సైరన్ మోగిస్తూ సిబ్బందిని హెచ్చరించారు. మాస్కులు, సేఫ్టీ సూట్లు ధరించి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదాన్ని అదుపుచేసే చర్యలు ప్రారంభించారు. చుట్టుపక్కల చెలరేగిన మంటలను నీటి ట్యాంకర్లతో ఆర్పివేశారు. ప్రమాదానికి గురైన కార్మికులను అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన విషయాన్ని జిల్లా అధికారులకు, ఫ్యాక్టరీ భద్రతా విభాగం అధికారులకు సమాచారం ఇచ్చారు.

అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం


ప్రమాదవార్త తెలిసిన వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. రెవెన్యూ, ఫ్యాక్టరీస్, విపత్తుల నిర్వహణ సంస్థ, ఎన్‌డీఆర్‌ఎఫ్, కాలుష్య నియంత్రణమండలి, అగ్నిమాపకశాఖ అధికారులు ఫ్యాక్టరీ వద్దకు చేరుకుని శాఖా పరమైన విధులు నిర్వర్తించారు. గేటు బయట ఏర్పాటు చేసిన స్టాంగ్ ఏరియా నుంచి సహాయక చర్యలను సమీక్షించారు. ఫ్యాక్టరీ బయట ప్రథమ చికిత్స కేంద్రం, సహాయ శిబిరాలను ఏర్పాటు చేశారు. స్వల్పంగా గాయపడిన వారిని వలంటీర్లు శిబిరానికి తరలించి చికిత్స అందించారు. కొద్దిసేపటికి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. సమీప గ్రామం చోడమ్మ అగ్రహారం ప్రజలను ఈ ప్రమాదకరమైన గ్యాస్ బారిన పడకుండా, గ్రామ సమీపంలోని పునరావాస కేంద్రానికి తరలించారు. అయితే ఇదంతా నిజమైన ప్రమాదం కాదు.

ఒక వేళ ఇలాంటి ఉపద్రవం సంభవిస్తే, దానిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగాన్ని సన్నద్ధం చేసే చర్యల్లో భాగంగా పూసపాటిరేగ మండలంలోని గైతులచోడవరం సమీపంలో గల మైలాన్ ల్యాబొరేటరీస్‌లో నిర్వహించిన మాక్‌డ్రిల్ ఇది.

మహాశివరాత్రి ఉత్సవాలకు సిద్ధం

- రామతీర్థంలో రెండు రోజుల పాటు జాతర
- ప్రత్యేక ఆకర్షణగా శిఖర జ్యోతి

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ రామస్వామివారి దేవస్థానంలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి దాదాపు లక్షమందికి పైగానే భక్తులు ఈ జాతరకు రానున్నారని అంచనా. దేవస్థానం, ఇతర శాఖల సిబ్బంది ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రామాలయం, శివాలయం వద్ద టెంట్లు, ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు. అలాగే రామకోనేరు వద్ద భక్తుల స్నానాలకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. విజయనగరం వైపు నుంచి వచ్చే భక్తులకు సీతారామునిపేట వద్ద, రణస్థలం వైపు నుంచి వచ్చే భక్తులకు దన్నానపేట జంక్షన్ వద్ద పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సుమారు 150 మంది పోలీసులు విధులు నిర్వహించనున్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు తమ సేవలను అందించనున్నాయి. శాశ్వత కేశఖండన శాల వద్ద పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ప్రథమ చికిత్స అందించేందుకు నెల్లిమర్ల, కొండవెలగాడ వైద్య సిబ్బందితో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఉమా సదా శివాలయంతో పాటు రామాలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. శుక్రవారం వేకువ జాము నుంచి రణస్థలం, విజయనగరం కేంద్రాల నుంచి ఆర్టీసీ బస్సులు సేవలందిస్తాయి. బోడికొండ సందర్శనకు వెళ్లే భక్తులు జాగ్రత్తలు పాటించాలని హెచ్చరిక బోర్డులను అనుసరించి వెళ్లాలని దేవాదాయశాఖతో పాటు పోలీస్ యంత్రాంగం కోరుతోంది.



రామక్షేత్రం చుట్టూ ఏర్పాటు చేసిన టెంట్లు



పూల అలంకరణతో ఉమాసదాశివాలయం



లడ్డూ ప్రసాదం తయారు చేస్తున్న స్వామి సేవకులు

శివాలయంలో ప్రత్యేక పూజలు

మహాశివరాత్రి పర్వదినాన శివాలయంలో ప్రత్యేక పూజలు జరగనున్నాయి. బ్రహ్మముహూర్త కాలంలో గణపతి పూజ, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కామాక్షి అమ్మవారికి హారతి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటలకు గణపతి పూజ, మహాన్యాస పారాయణం జరిపించి 11 రకాల పండ్ల రసాలు, భస్మం, చందనం, కుంకుమ, సుగంధ ద్రవ్యాలు, నారికేళ జలాలతో శివుడికి అభిషేకాలు జరిపిస్తారు. అర్ధరాత్రి 12 గంటలకు మహా లింగోద్భవ సమయంలో స్వామికి విభూది సమర్పణ చేస్తారు.

శిఖర జ్యోతి ప్రత్యేక ఆకర్షణ

రామతీర్థంలో శుక్రవారం సాయంత్రం సుమారు 6 గంటలకు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు శిఖర జ్యోతిని వెలిగిస్తారు. ఆయన సొంత నిధులతో జరగనున్న ఈ కార్యక్రమంలో 300 కేజీల నెయ్యితో వెలిగించే జ్యోతి రెండు రోజుల పాటు బోడికొండపై ఈ భక్తులను కనువిందు చేయనుంది. శిఖర జ్యోతి కార్యక్రమం అనంతరం రూ.ఒక లక్ష విలువ చేసే బాణసంచాను పెద్ద ఎత్తున కాల్చనున్నారు.

నడకయాతనకు విముక్తి

- నాగావళి నదిపై వంతెన పూర్తి
- అందుబాటులోకి వచ్చిన కిమ్మి-రుషింగి బ్రిడ్జి
- వైఎస్సార్‌సీపీ చొరవతో పుష్కర కాలం కల సాకారం
- ఈనెల 11న ప్రారంభించనున్న విద్యాశాఖ మంత్రి బొత్స



కిమ్మి-రుషింగి వంతెన

వీరఘట్టం: పార్వతీపురం మన్యం జిల్లాలోని వీరఘట్టం మండలం, విజయనగరం జిల్లాలోని వంగర మండలాల ప్రజలు 12 ఏళ్లుగా ఎదురు చూస్తున్న కిమ్మి-రుషింగి వంతెన ప్రారంభానికి సిద్ధమైంది. కొద్ది రోజుల క్రితం వంతెన, ఇరువైపులా అప్రోచ్ రోడ్డు పనులు పూర్తయ్యాయి. దీంతో ఈనెల 11న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఈ వంతెనను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వంతెన అందుబాటులోకి రావడంతో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలోని వీరఘట్టం, వంగర, బలిజిపేట, గరుగుబిల్లి, బొబ్బిలి మండలాల్లోని సుమారు 40 గ్రామాల ప్రజలకు నడక కష్టం దూరమైంది. దీంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ కిమ్మి-రుషింగి చరిత్ర..

నాగావళి నదిలో కిమ్మి-రుషింగి గ్రామాల మధ్య 2008లో జరిగిన పడవ ప్రమాదం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది.ఈ విషాద ఘటనపై అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి ఈ ప్రాంతంలో వంతెన నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. అనుకున్నట్లుగానే అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే వైఎస్‌ఆర్ మరణానంతరం సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి రూ.29.5 కోట్లు నిధులు మంజూరు చేశారు. 2012లో శ్రీకాకుళం జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు కొత్తూరు మండలంలో రిమోట్ శంకుస్థాపన చేశారు. తర్వాత పనులు ప్రారంభమయ్యాయి. అయితే 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం చిత్తశుద్ధి చూపకపోవడంతో వంతెన పనుల్లో వేగం తగ్గింది. తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణంపై దృష్టి సారించడంతో పనులు పూర్తయ్యాయి.

11న వంతెన ప్రారంభిస్తాం

కిమ్మి-రుషింగి వంతెన పనులు పూర్తయ్యాయి.ఈనెల 11న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వంతెనను ప్రారంభించి అందుబాటులోకి తీసుకువస్తారు. వంతెన నిర్మాణం పూర్తికావడంతో వీరఘట్టం, వంగర మండలాలతో పాటు బలిజిపేట, బొబ్బిలి, గరుగుబిల్లి మండలాల్లోని గ్రామాలకు మార్గం సుగమమైంది.


బి.గౌరీశ్వరరావు, డీఈఈ, ఆర్‌అండ్‌బీ

జాతీయ తైక్వాండో పోటీల్లో రాణించాలి

- క్రీడాకారిణిని అభినందించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం:

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు నగరానికి చెందిన వి. హిమశ్రీ ఎంపిక కావడం గర్వంగా ఉందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఈ మేరకు గురువారం తన స్వగృహంలో ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా తైక్వాండో చీఫ్ కోచ్ డీవీ చారి మాట్లాడుతూ నగరానికి చెందిన వి.హిమశ్రీ ఇటీవల పాండిచ్చేరిలో జరిగిన ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ తైక్వాండో పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించి, త్వరలో జరగనున్న జాతీయ పోటీలకు ఎంపికైందని చెప్పారు. ఈనెల 9, 10, 11 తేదీలలో ఒడిశా రాష్ట్రంలోని, కటక్‌లో జరగనున్న ఆలిండియా జాతీయ పోటీల్లో తన సత్తా మరోసారి నిరూపించనుందన్నారు. గతంలో మూడుసార్లు జాతీయ పోటీలలో హిమశ్రీ పతకాలను సాధించిందని గుర్తుచేశారు.క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.



హిమశ్రీని అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి